కోడ్ ఘురూ

- చెక్‌పోస్టులు ఏర్పాటు మొదలైన తనిఖీలు
- జిల్లాలో ఓటేయనున్న 14,18,688 మంది ఓటర్లు
- జహీరాబాద్,మెదక్ ఎంపీ స్థానాలకు మే 13న పోలింగ్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూలు విడుదల చేయడంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చింది. దీంతో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే తప్పక రసీదులు చూపించాల్సి ఉంటుంది. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ఎక్కువ నగదు తీసుకెళ్తే అందుకు తగిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. అధికారులు ఈ మేరకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని అసెంబ్లీ ఐదు నియోజకవర్గాలు జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలకు వస్తాయి. ఈ స్థానాలకు మే 13న పోలింగ్ జరుగనున్నది.

ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ జారీ కానున్నది. అదే నెల 25న నామినేషన్లకు గడువు పూర్తి కానుండగా, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనున్నది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు, 6న ఎన్నికల ప్రక్రియ ముగిసేలా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ జిల్లాలో అమలులోకి వచ్చింది.

సంగారెడ్డి జిల్లాలో ఓటేయనున్న 14,18,688 ఓటర్లు

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 14,18,688 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో 7,11,011 మంది పురుషులు ఉండగా, 7,07,538 మంది మహిళా ఓటర్లు, 139 మంది ట్రాన్స్‌జెండర్లు, 353 సర్వీసు ఓటర్లు ఉన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 16,35,042 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనుండగా, అందులో 7,98,888 మంది పురుషులు, 8,36,095మంది మహిళా ఓటర్లు, 59 మంది ట్రాన్స్‌జెండర్లు, 967 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 18 నుంచి 19 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న ఓటర్లు 52,464 మంది ఉండగా, 32,315 మంది పీడబ్ల్యూడీ, 7,853 మంది 85 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 1594 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా, 1313 సాధారణ పోలింగ్ కేంద్రాలు, 281సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని అధికారులు వెల్లడించారు.

24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తినా 1950కు ఫోన్ చేసి తెలియజేయాలి. ఈ కాల్‌సెంటర్ 24 గంటల పాటు పనిచేస్తుంది. ఎన్నికలకు ఎలాంటి విఘాతం కలిగించే చర్యలైనా సీ విజిల్ యాప్‌లో పొందుపర్చాలి. సంబంధిత అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని చర్యలు తీసుకుంటారు. జిల్లాలో ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారు వెంటనే ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చు. మార్పుల కోసం ఫారం-8ని కూడా సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లను తొలిగిస్తాం. ఎన్నికల వ్యయానికి సంబంధించి అభ్యర్థులు విధిగా ప్రత్యేక ఖాతా తెరవాలి. సదరు ఖాతా ద్వారా మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒక్కో అభ్యర్థికి గరిష్టంగా రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకు నే అవకాశం ఉంది. అందుకు వ్యయ పరిశీలకుల బృందం ఎప్పటికప్పుడు వ్యయా న్ని పరిశీలిస్తుంది. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం.

- వల్లూరు క్రాంతి, సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

జహీరాబాద్ ఎంపీ స్థానం పరిధిలో ఓటర్ల వివరాలు

జిల్లా పేరు	అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం ఓటర్లు	సర్వీసు ఓటర్లు
సంగారెడ్డి	నారాయణఖేడ్(35)	1,18,410	1,17,958	9	2,36,377	66
సంగారెడ్డి	అందోల్ (36)ఎస్సీ	1,22,296	1,27,785	5	2,50,086	49
సంగారెడ్డి	జహీరాబాద్(38)ఎస్సీ	1,37,054	1,37,140	2	2,74,196	102
కామారెడ్డి	జుక్కల్ (13)ఎస్సీ	99,230	1,02,991	9	2,02,230	138
కామారెడ్డి	ఎల్లారెడ్డి(15)	1,06,550	1,15,708	2	2,22,260	258
కామారెడ్డి	కామారెడ్డి(16)	1,21,980	1,31,882	19	2,53,881	162
నిజామాబాద్	బాన్సువాడ(14)	93,368	1,02,631	13	1,96,012	192
	మొత్తం ఓటర్లు	**7,98,888**	**8,36,095**	**59**	**16,35,042**	**957**

ముదిరాజులు కలిసికట్టుగా ఉండాలి

కోహీర్, మార్చి17: ముదిరాజులందరూ కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని దిగ్వాల్ గ్రామంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. భవన నిర్మాణం పూర్తి అయ్యేందుకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గొర్రె పిల్లలా కాకుండా పులుల్లా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షుడు న్యాయవాది శంకర్, సంగప్ప, సత్యనారాయణ, రామలింగారెడ్డి, మల్లేశం, వెంకేశ్వరరాజు, శంకర్, శ్రీనివాస్, నారాయణ, రాములు, శివకుమార్ పాల్గొన్నారు.

ముదిరాజ్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు కుమార్, నాయకులు

పదేళ్ల నిరీక్షణకు దక్కిన ఫలితం

రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి చైర్‌పర్సన్‌గా నిర్మలారెడ్డి

సంగారెడ్డి, మార్చి 17: రాష్ట్రంలో డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి 37కార్పొరేషన్లను భర్తీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డిని రాష్ట్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమిస్తూ అధికారిక ఆదేశాలు శనివారం రాత్రి విడుదల చేశారు. పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ నిర్మలారెడ్డికి పదవి దక్కడం, పదేళ్లపాటు నిరీక్షణకు ఫలితం వచ్చిందని సంబురాలు చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ అధికారికంగా వెలువడుతుందన్న సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా రాష్ట్ర వ్యాప్తంగా 37కార్పొరేషన్లకు నామినేట్ పోస్టులను భర్తీ చేసి ఆశావాహులకు తీపి కబురు ఇచ్చింది.

పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ

విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం, మార్చి 17: విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా పరీక్షలకు హాజరు కావాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కెబీఆర్ కాలనీకి చెందిన పీఎస్‌ఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పదో తరగతి పరీక్షలు రాయాలని సూచించారు. ఉత్తమ జీపీఏలు సాధించి మున్సిపాలిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పోతుకూచి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేకి బీజేపీని ఓడించండి

పటాన్‌చెరు, మార్చి 17 : కార్మిక లోకానికి అండగా ఉండే పార్టీకే హింద్ మజ్దూర్ సంఘ్ అండగా ఉంటుందని హింద్ మజ్దూర్ సంఘ్ (హెచ్‌ఎంఎస్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలోని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ ఈఎస్‌ఐ సంస్థలో కార్మికుల కష్టార్జితంతో పోగు చేసుకున్న రూ. 2వేల కోట్ల ఫిక్స్ డిపాజిట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ దవాఖానల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కార్మిక రంగం ఉనికిని ప్రశ్నార్థకం చేసిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే ఉపసంహరించాలన్నారు. ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని సూచించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కార్మిక సంక్షేమానికి కృషి చేసే పార్టీలకు ఓటేయాలన్నారు. మతతత్వ బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ నర్సయ్య, జనరల్ సెక్రటరీ రెబ్బ రామారావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి భాగ్యవతి పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరవుతున్న ప్రతినిధులు

భగవన్నామ స్మరణకు సమయం కేటాయించాలి

సిర్గాపూర్, మార్చి 17 : నిత్యం ఎన్ని పనులు ఉన్నా.. అందులో కొంత సమయాన్ని భగవన్నామస్మరణకు కేటాయించాలని జుక్కల్ సమర్థ రాందాసీ మఠాధిపతులు గోవిందమహారాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని పొట్పల్లి గ్రామంలో సమర్థ సంప్రదాయ శ్రీరామ నామస్మరణ బిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు ప్రతి ఏడాదిమాదిరిగానే ప్రతి ఇంటినీ పర్యటించి మనాచి శ్లోకాలను ఆలపిస్తూ శ్రీ రామ నామ భిక్ష చేశారు. ఈమేరకు భక్తులు సమర్పించిన సాహిత్యం, కానుకలను ఆయన స్వీకరించారు. అనంతరం స్థానిక హనుమాన్ మందిరం వద్ద భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక విషయాలపై ప్రవచనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ : పొట్పల్లిలో శ్రీ రామన నామ భిక్షా చేస్తున్న గోవింద్ మహారాజ్

ప్రిన్సిపాల్ శైలజను ఎస్సీఈఆర్టీలో నియమిస్తూ ఉత్తర్వులు

శైలజ (ప్రిన్సిపాల్ ఆదర్శ పాఠశాల బొల్లారం)

బొల్లారం, మార్చి 17 : బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజను రెండు సంవత్సరాల డిప్యుటేషన్ విధానంపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్‌లో ఓడి ప్రాతిపదికన నియమిస్తూ, అదే సమయంలో రిలీవింగ్ చేయాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ మోడల్ స్కూల్స్ నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతలను పిజిటి ఉపాధ్యాయుడు బాలకృష్ణకు అప్పగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఆమె నియమాకంపై పాఠశాల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

కిష్టయ్యపల్లిలో జాతర

జిన్నారం, మార్చి 17: కిష్టయ్యపల్లి గ్రామంలో గాలిపోచమ్మ ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతర ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉత్సవాలు జరిగాయి. జాతరకు కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాట సుధారాణి హాజరయ్యారు. ఎంపీటీసీ జనాబాయి, మాజీ సర్పంచ్ ప్రకాశ్ చారి, సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డెకృష్ణ, స్థానిక నాయకులతో కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల జాతరలు గ్రామస్తుల సమష్టికి నిదర్శనమన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మన జాతరలు నిలువుటద్దమన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వేణు, వీరేందర్ పాల్గొన్నారు.

గాలి పోచమ్మను దర్శించుకుంటున్న నాయకులు

దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు దోహదం

రామచంద్రాపురం, మార్చి17: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు దోహదపడుతాయని మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లో మల్లేపల్లి లక్ష్మమ్మ శంకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని తెలిపారు. వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాల అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కుమార్‌గౌడ్, క్రిస్టఫర్, నాయకులు కృష్ణ, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, మల్లారెడ్డి, రాజీ రెడ్డి, శ్రీనివాస్, సందీప్, సుధీర్, మల్లేశ్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

చలి వేంద్రాల ఏర్పాటు మంచి నిర్ణయం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 17: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశం పొందిన పదో తరగతి, ఇంటర్మీడియట్ అభ్యాసకులు తత్కాల్ స్కీమ్ కింద ఈ నెల 18నుంచి 21వరకు పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. పదో తరగతికి సంబంధించి ప్రతి సబ్జెక్టుకు రూ. 100 థియరీకి, రూ. 100ప్రాక్టికల్స్‌కు చెల్లించాలని, తత్కాల్ ఫీజు రూ. 500లు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఇంటర్మీడియట్‌కి సంబంధించి ప్రతి సబ్జెక్టుకు రూ. 150థియరీకి, రూ. 150ప్రాక్టికల్స్‌కు చెల్లించాలని, తత్కాల్ ఫీజు రూ.1000లు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో-అర్డినేటర్ 800840 3635ను సంప్రదించాలన్నారు.

ఏప్రిల్ 25 నుంచి పరీక్షలు

ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఏప్రిల్ 25నుంచి మే 2వ తేదీ వరకు థియరీ, మే 3నుంచి 10వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని డీఈవో వెల్లడించారు.

పరీక్ష ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రుసుము చెల్లించిన వారందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని స్పష్టం చేశారు.

అకాల వర్షం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- గాలి దుమారానికి ఇండ్ల పై నుంచి ఎగిరిపోయిన రేకులు, దెబ్బతిన్న పంటలు

హద్నూర్‌లో కురుస్తున్న భారీ వర్షం

న్యాల్‌కల్, మార్చి 17 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని హద్నూర్, గుంజోట్టి, రాంతీర్థం, ముంగి, మెటల్‌కుంట, హుస్సేల్లి, మామిడ్గి, రుక్మాపూర్, మల్కన్‌పాడ్, న్యాల్‌కల్, వడ్డి తదితర గ్రామాల్లో ఉన్నట్టుండి మేఘాలు కుమ్ముకుని భారీ గాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో గాలికి ఇండ్లపై నుంచి రేకులు ఎగిరిపోయాయి.

కోతకు వచ్చిన జొన్న, కుసుమ, గోదుమ తదితర పంటలు నేలకొరగడంతో పంటలకు తీవ్ర నష్ట జరిగింది. మామిడి చెట్ల కు కాసిన కాయలు నేలరాలయి. కురిసిన భారీ వర్షంతో ఎండల తీవ్రతతో అల్లాడిన ప్రజానీకానికి కొంత ఉపశమనం కలిగింది. మండలంలోని అల్లాదుర్గం-మెటల్‌కుంట ప్రధాన రోడ్డు మార్గంలో తుమ్మచెట్లు విరిగిపోయి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

చెట్లు ప్రధాన రోడ్డుపై పడడంతో నిలిచిపోయిన వాహనాలు

అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డుపై రోడ్డుపై విరిగిపోయిన పడిన తుమ్మచెట్లు



హద్నూర్ గ్రామ సమీపంలో నేలకొరిగిన జొన్న పంట

నాగిరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు

కోహీర్, మార్చి17: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈజీఎస్ నిధుల నుంచి రూ. 8లక్షల వ్యయంతో గ్రామంలోని పాఠశాల సమీపంతో పాటు దళితవాడలో సీసీరోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో బడంపేట ఆలయ కమిటీ సభ్యుడు అంజయ్య, దశరథ్, మొగులయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నిబంధనలు పాటించాలి

కోహీర్, మార్చి17: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని తహసీల్దార్ బాలశంకర్ కోరారు. ఆదివారం మండలంలోని కొత్తూర్(డి), కవేలి, కోహీర్, తదితర గ్రామాల్లో పర్యటించి పంచాయతీ కార్మికులకు పలు సూచనలు చేశారు. గోడ పత్రికలు, బ్యానర్లు, కటౌట్లు ఎక్కడా కనిపించకూడదని ఆదేశించారు. పార్టీలకతీతంగా వాటిని వెంటనే తొలిగించాలన్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తామన్నారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముగ్గురిపై కేసునమోదు

హత్నూర, మార్చి17 : హత్నూర మండలం నవాబుపేట గ్రామ మాజీసర్పంచ్ కిష్టయ్య, అతని కుటుంబసభ్యులపై దాడిచేసిన ఘటనలో ముగ్గురిపై కేసునమోదుచేసినట్లు హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు. ఈనెల 13న గ్రామంలో జరిగిన ఓపెళ్లికి హాజరైన కిష్టయ్య అతని కుటుంబ సభ్యులపై అకారణంగా అదే గ్రామానికిచెందిన నగేశ్, వెంకటేశ్, శ్రీకాంత్‌లు శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు తెలిపారు. దీంతో శనివారం బాధితులు ఇచ్చిన పిర్యాదుమేరకు ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

కంగ్టి, మార్చి 17: పిడుగుపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని భీంరా గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కంగ్టి ఎస్సై విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంరా గ్రామానికి చెందిన శిరుగొండ (45) ఆదివారం పొలంలో పని చేస్తున్న క్రమంలో సాయంత్రం సమయంలో వడగండ్లతో వర్షం కురియడంతోపాటు పిడుగుపడింది. అక్కడే ఉన్న శిరుగొండ అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే పని చేస్తున్న మిగతావాళ్లు కూడా గాయపడడంతో వెంటనే నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పిడుగుపడి మృతిచెందిన శిరుగొండ

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

గుమ్మడిదల,మార్చి 17 : మనస్తాపానికి గురైన మహిళ తన పిల్లలతో సహా అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగులో చోటుచేసుకుంది. ఏఎస్సై ఎండీ ఫర్వేజ్ తెలిపిన వివరాలు ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, సద్రిపోస్‌పాలి జిల్లా, గ్రామం ప్రతాప్‌గఢ్‌కు చెందిన కస్తూర్‌రాం ఎనిమిదేండ్ల క్రితం బతుకుదేరువు కోసం మండలంలోని దోమడుగు గ్రామానికి వలస వచ్చారు. వీరు వినాయక విగ్రహాలను తయారు చేసి జీవనం కొనసాగిస్తున్నారు. కస్తూర్‌రాంకు ఐదుమంది సంతానం. మూడో కుతూరు సంగీత (28)ను కాలురాం అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. సంగీత, కాలురామ్ దంపతులకు ఇద్దరు సంతానం కూతురు సుందర (9), కొడుకు ప్రవీణ్(12), కాగా రెండు నెలల క్రితం సంగీతను భర్త కాలురాం వదిలి పెట్టాడు. దీంతో తండ్రి వద్దనే సంగీత తన పిల్లలతో ఉంటుంది. భర్త విడిచి వెళ్లడంతో మనస్తాపానికి గురైన సంగీత, తన కొడుకు, కూతురుతో గత నెల 16వ తేదీన ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో వెళ్లిపోయింది. తండ్రి కస్తూర్‌రామ్ ఉదయం లేచి చూడగా కనిపించకపోవడంతో ఎక్కడ వెతికిన ఆచూకీ లభించకపోడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దోమడుగులో తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన తల్లి సంగీత (ఫైల్)

డాక్యుమెంట్లు పోయినవి

1. చెవుల సంగయ్య, తండ్రి బాగయ్య, R/o. సర్వే నం. 55/1, ప్లాట్ నం.13, డాక్యుమెంట్ నం. 677/2004 మరియు 2. చెవుల వీరమ్మ, భర్త సంగయ్య, R/o. నారాయణఖేడ్, సర్వే నం. 29/2/ఆ, ప్లాట్ నం. 5. డాక్యుమెంట్ నం. 1293/2002, నివాసం: పోచారం, మండలం రేగోడ్, జిల్లా మెదక్. 11-03-2024న నారాయణఖేడ్‌లో రాజీవ్ చౌక్ నుండి బసవేశ్వర చౌక్‌కు ప్రయాణం చేస్తుండగా నా ఒరిజినల్ డాక్యుమెంట్లు పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికితే సంప్రదించండి.: 7330671327.